క్లుప్తంగా

మహానందీశ్వరుడి సన్నిధిలో ఆధ్యాత్మిక గురువు



రాధా మనోహర్ దాస్ స్వామీజీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న పురోహితులు

నంద్యాల(అర్బన్): మహానందిలో వెలసిన శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, సనాతన హిందూ ధర్మ పరిరక్షకులు రాధా మనోహర్ దాస్ స్వామీజీ శుక్రవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక గురువుకు ఏఈఓ మధు, పురోహితులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

టైడ్ ఫండ్స్ మంజూరు

జూపాడుబంగ్లా: మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు రూ.48,38,303 టైడ్ ఫండ్స్ మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లోని జనాభాను అనుసరించి ఆయా గ్రామాలకు నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులను తాగునీటి సౌకర్యం, చెత్తాచెదారం, మురుగు నిల్వల తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలకు వినియోగించుకోవాలని తెలిపారు. 80బన్నూరు గ్రామానికి రూ.3,35,318, భాస్కరాపురం రూ.1,83,458, జూపాడుబంగ్లా రూ. 7,31,469, మండ్లెం రూ.6,57,074, పి.లింగాపురం రూ.1,55,054, పారుమంచాల రూ.7,40,733, పోతులపాడు రూ.1,88,206, తంగడంచ రూ.3,33,109, తరిగోపుల రూ.4,43,440, తర్తూరు 2,87,109, తాటిపాడు రూ.3,27,050, తూడిచెర్ల గ్రామానికి రూ.4,56,283ల చొప్పున నిధులు మంజూరైనట్లు వివరించారు.

గణపతి ఆబాలగోపాలానికి ఇష్టదైవం



గణపతి ప్రవచనాలు వినిపిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

శ్రీశైలంటెంపుల్: వినాయకునిగా, గణపతిగా, ఏకదంతుడుగా, వక్రతుండునిగా పలు నామాలతో పూజలందుకునే గజాననుడు ఆబాలగోపాలానికి ఇష్టదైవమని ప్రముఖ ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గణపతి గాథలు ప్రవచనాలు ఏడవ రోజు శుక్రవారం కొనసాగాయి. సామవేదం షణ్ముఖశర్మ మాట్లాడుతూ గణపతిని జ్యేష్ఠరాజు అని వేదం కీర్తించిందన్నారు. గొప్పవారిని జ్యేష్ఠులు అంటారని, అలాంటి మహనీయులలో అత్యంత శ్రేష్ఠుడిగా స్తుతించబడుతున్న గణపతిని జ్యేష్ఠరాజుగా పేర్కొన్నారన్నారు. గణపతికి నవరాత్రోత్సవాలను జరపడం సంప్రదాయమన్నారు. నవసంఖ్య పూర్ణత్వానికి సంకేతం కనుక ఒక దేవతాశక్తిని సంపూర్ణంగా గ్రహించేందుకే తొమ్మిదినాళ్ల ఉత్సవాలను చేపట్టడం ఆచారంగా మారిందన్నారు. అలాగే సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమాన్విత విశేషాలను వివరించారు. స్వామివారి ఆలయంలోని రత్నగర్భ గణపతిని చింతామణి గణపతిగా కూడా పేర్కొన్నారని, ఈ గణపతిని దర్శిస్తే కోరికలన్నీ నెరవేరుతాయని వివరించారు.

నేడు పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండలంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నామని ఎంపీడీఓ గోపీక్రిష్ణ తెలిపారు. మండలంలో 5,823 మంది ఫించన్‌దారులున్నారని వెల్లడించారు. వీరికి రూ.2,40,72,000 అందజేయనున్నట్లు చెప్పారు. 13 సచివాలయాల పరిధిలోని 123 మంది సిబ్బందితో 207 క్లస్టర్లలో పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. పింఛన్ల పంపిణీలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వెలుగోడు: పట్టణంలోని సచివాలయం-2లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఉదయానంద క్యాన్సర్ సెంటర్ మార్కెటింగ్ మేనేజర్ జగదీష్ శుక్రవారం తెలిపారు. ఉదయానంద క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యులు పాల్గొని చికిత్స చేస్తారని, అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు

మిడుతూరు: మండల పరిధిలోని నాగలూటీ-నందికొట్కూరు క్రాస్ రోడ్డులో సారా విక్రయిస్తున్న నందికొట్కూరుకు చెందిన నీలిశికారి వంశీని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు శుక్రవారం తెలిపారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

శ్రీశైలం: క్షేత్రంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిద్దామని, మొక్కలను నాటి సంరక్షించాలని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ స్థానంలో గుడ్డ సంచులు వాడాలని కోరారు. క్షేత్ర పరిధిలో కనీసం వంద మొక్కలు నాటి పరిరక్షించాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల స్థానంలో మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని గణేష్ కమిటీ సభ్యులకు సూచించారు.

మోతాదుకు మించితే నష్టమే!

- వరిలో ఎరువుల యాజమాన్యం కీలకం
- అవసరం మేరకు వినియోగిస్తే మంచి ఫలితాలు
- జిల్లాలో 65,787 హెక్టార్లలో వరి సాధారణ విస్తీర్ణం
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న శాస్త్రవేత్తలు



గోస్పాడు: జిల్లాలో ప్రస్తుతం వరిసాగు జోరుగా సాగుతోంది. ఈ పంట సాగులో ఎరువుల యాజమాన్యం చాలా కీలకం. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేర వినియోగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు ఆశించిన దిగుబడులు కూడా కోల్పోయే ప్రమాదముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరిలో అధిక దిగుబడుల సాధనకు రైతులు ఎరువుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

జిల్లాలో 60వేల హెక్టార్లలో వరి సాగు...

జిల్లాలో ఈ ఏడాది వరి సాగుకు 65,787 హెక్టార్ల సాధారణ విస్తీర్ణం కాగా దాదాపు 60 వేల హెక్టార్ల వరకు సాగు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు తోడు ఈ ఏడాది కాలువలకు నీరు కూడా వదిలారు. ఫలితంగా రైతులు నారుమడులను సిద్ధం చేశారు. కొన్ని చోట్ల వరినాట్లు సైతం జోరందుకున్నాయి. జిల్లా పరిధిలో ఇప్పటికే దాదాపుగా 80 శాతం విస్తీర్ణంలో నాట్లు వేసినట్లు అధికారుల అంచనా. ముందుగా నాట్లు వేసిన రైతులు ఒక పక్క పంట ఏపుగా ఎదగడానికి, మరోపక్క తెగుళ్ల, కలుపు నివారణకు ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరి సాగులో యూరియా, డీఏపీతో పాటు పొటాష్‌ను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం ఇలా..

ఎకర పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు ఏపుగా ఎదుగుతుంది. ప్రధాన పొలంలో మొదటి దమ్ములో ఎకరాకు 10 కిలోల జింకు సల్ఫేట్ వేసుకోవాలి. నాటుకు ముందు దమ్ములో ఎకరాకు 75 కిలోల డీఏపీ, 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ వేసుకోవాలి. తదుపరి దుబ్బులు వచ్చే దశలో 45 కిలోల యూరియా, చివరగా అంకురం దశలో 45 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఎరువులు వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. పైరు సాగుకు ముందు తొలకరిలో జీలుగ, జనుము, పిల్లిపెసర, నవధాన్యాలు వేసుకున్నట్లు అయితే సిఫార్సు చేసిన ఎరువు, మందుల్లో 15 నుంచి 20 శాతం తగ్గించి వాడుకోవచ్చు. అలాగే జీవన ఎరువులు అయిన అజోష్, పైరిల్లాం, పాస్ఫోబ్యాక్టీరియాలను ఎకరాకు కిలో వంతున 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి చల్లుకున్నట్లు అయితే సిఫార్సు చేసిన ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చు.

ఫొటాష్ లోపంతో ప్రమాదం..

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా, డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై ఆసక్తి చూపరు. దీంతో పొటాష్ లోపంతో పైరుకు చీడపీడలు సోకి గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు...

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలి. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుంది.

సేంద్రియ ఎరువులను విస్మరించొద్దు



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. సేంద్రియ ఎరువులను రైతులు పూర్తిగా విస్మరిస్తున్నారు. దాని వల్ల భూమిలో జీవ చైతన్యం సన్నగిల్లిపోతుంది. ఈ నేపథ్యంలో రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువుల వాడకం పెరగాలి. పొలాన్ని సంవత్సరం పొడవునా ఏదో ఒక పైరుతో పచ్చగా ఉంచినట్లు అయితే సూక్ష్మజీవుల చర్యలు సంవృద్ధిగా ఉండి నేల ఆరోగ్యంగా ఉండటంతో పాటు పోషణ శక్తి బాగుంటుంది. –దేసు బాలరాజు, సస్యరక్షణ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం యాగంటిపల్లి

జూపాడుబంగ్లాలో 19.2 మి.మీ వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు 19.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 19.4 మి.మీ వర్షపాతం కురవగా పాములపాడు మండలంలో అత్యల్పంగా 5.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. జూపాడుబంగ్లాలో 19.2 మి.మీ, మిడ్తూరులో 16.2 మి.మీ, పగిడ్యాలలో 14 మి.మీ, కొత్తపల్లిలో 10.6 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

నాలుగు మండలాల్లో సాధారణం కంటే అధికం

నియోజకవర్గంలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడ్తూరు, పగిడ్యాల మండలాల్లో ఆగస్టులో కురవాల్సిన సాధారణ వర్షం కంటే అధిక వర్షపాతం నమోదైంది. కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో కాస్త తక్కువ వర్షపాతం నమోదైంది. నందికొట్కూరు మండలంలో ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 136 మి.మీ కాగా 24.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జూపాడుబంగ్లాలో 166.2 కు గాను 170.2 మి.మీ, మిడ్తూరులో 144.2కు గాను 225.2 మిల్లీమీటర్లు, పగిడ్యాల మండలంలో 116.2 మి.మీకు 203.6 మి.మీ, కొత్తపల్లిలో 157.5 మి.మీకు 114.6, పాములపాడు మండలంలో 161.4 మి.మీకు గాను 131.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ప్రశాంతంగా షరాఫ్ వేలం పాట



పోలీసుల బందోబస్తు మధ్య మల్యాల గ్రామంలో షరాఫ్ వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నందికొట్కూరు: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేలం పాటలు ప్రశాంతంగా జరిగిందని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఫ్యాక్షన్ మల్యాల గ్రామంలో పోలీసుల బందోబస్తు మధ్య మల్యాల గ్రామ రైతు సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే షరాఫ్ వేలం పాటలో ఎలాంటి గొడవలు జరగకుండా రూ.3.50 లక్షలకు చంద్రశేఖర్ నాయుడు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. ఫ్యాక్షన్ వల్ల అనేక కుటుంబాలు సర్వ నాశనమయ్యాయని గుర్తు చేశారు. సామరస్యంగా సమస్యలను పరిష్కారం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఎలాంటి సమస్యలైనా గ్రామంలో పరిష్కారం కాకపోతే పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు. క్షణికావేశాలకు లోనై లేనిపోని సమస్యలు తెచ్చుకోవద్దని చెప్పారు. గ్రామ రైతు సంఘం అధ్యక్షుడిగా బాలమద్దయ్య, సభ్యులు షాకీర్‌బాషా, నరసన్నగౌడు, కుర్వ వెంకటయ్య, మాదిగ సుబ్బయ్య, బోయ శివశంకర్, షేక్ మౌలాలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్ఐలు సురేష్‌బాబు, చంద్రశేఖర్, పోలీసులు పాల్గొన్నారు.

రగ్బీలో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



ఎంపీ నాగరాజు నుంచి బహుమతి అందుకుంటున్న లక్ష్మాపురం గురుకులం విద్యార్థినులు

నందికొట్కూరు: కర్నూలులో గురువారం జరిగిన ఉమ్మడి జిల్లా రగ్బీ పోటీల్లో లక్ష్మాపురం బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణమ్మ తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌లో ఎంపీ నాగరాజు చేతుగా మీదుగా ట్రోఫీ అందుకున్నట్లు చెప్పారు. శుక్రవారం గురుకులంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు పెద్ద పీట వేశామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో రగ్బీలో తమ విద్యార్థులు మొదటి స్థానం సాధించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి



నల్లకాల్వ వాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణ రెడ్డి

ఆత్మకూరురూరల్: తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలని ఆత్మకూరు ఎస్ఐ నారాయణ రెడ్డి అన్నారు. మండంలోని నల్లకాల్వ గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడకం విశృంఖలంగా తయారైన ఈ రోజుల్లో పిల్లలు సెల్‌లో ఏం చూస్తున్నారు, ఏం చేస్తున్నారనేది నిత్యం పరిశీలిస్తుండాలన్నారు. అవాంఛిత చిత్రాలు చూడడం వల్ల తెలిసీ తెలియని వయస్సులో పిల్లలు నేర ప్రవృత్తికి అలవాటు పడుతున్నారని చెప్పారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం పోలీసులకు తెలపాలని, సమాచారమిచ్చిన వారి గురించి రహస్యంగా ఉంచుతామని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలను గురించి వివరించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొందరు నేరస్తులు ఊరికి ఒక కుటుంబంగా వచ్చి నేరాలకు పాల్పడుతూ, ఆయా గ్రామాల్లోని యువకులను నేరాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆత్మకూరు: హమాలీ కార్మికులకు ప్రత్యేక చట్టం, వెల్ఫేర్ బోర్డు, పని భద్రత, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటివి వర్తింపజేసి వారిని ఆదుకోవాలని సీఐటీయూ పట్టణాధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు రణధీర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పని ప్రదేశంలో సరైన వసతులు లేక హమాలీలకు ప్రమాదాలు జరిగినా, మరణించినా ప్రభుత్వం, యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నెలకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు. ప్రమాదానికి గురై వికలాంగుడిగా మారిన కార్మికుడికి రూ.5 లక్షలు, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. హమాలీ ఫెడరేషన్ నాయకులు రఫీ, హుసేన్‌బాషా, మాబాషా, నరసింహారెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ఆంజనేయులు

వెలుగోడు: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని ఏడీఏ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం గుంతకందాల గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో ఏడీఏతో పాటు ఏఓ పవన్ కుమార్ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన ఆహారోత్పత్తులు సాధించాలని సూచించారు. సేంద్రియ ఎరువులు వాడితే పంట ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతో పాటు పోషక పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. పంట మొదటి దశలో ఆకు ముడత,కాండం తొలిచే పురుగుల నివారణకు వేపనూనె లీటర్ నీటిలో రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వరి పొలాల గట్లపైన కంది మొక్కలు వేసుకోవాలన్నారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

పాములపాడు: అతిసార వ్యాధితో మృతి చెందిన బోయ లక్ష్మి దేవి కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు శుక్రవారం డిమాండ్ చేశారు. కలుషిత నీరు తాగడం వల్లే వ్యాధి ప్రబలినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

నందికొట్కూరు: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సీఐ మాట్లాడారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని చెప్పారు. గ్రామంలో దళితులపై వివక్షత చూపిస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామన్నారు. గొడవలకు ఆస్కారం లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. భూతగాదాలు ఉంటే రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు, పోలీసులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు



షాహిన్‌షా దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

కొత్తపల్లి: ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ మేరి, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెన్నెలా గార్డెన్స్‌లో పంచాయతీ కార్యదర్శి షాహిన్‌షా పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షాహిన్‌షా మండలంలో సదీర్ఘకాలం పనిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈఓ శ్రీరాములు, ఏపీఓ రేష్మ, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, సర్పంచ్ జమిలాభి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలకు తక్షణ పరిష్కారం



వీఆర్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ ఉమారాణి

కొత్తపల్లి: రైతుల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీఆర్వోలు తమ దృష్టికి వచ్చే ప్రతి సమస్యను త్వరితగతిన విచారించి పరిష్కారం చూపాలని సూచించారు. ముఖ్యంగా రైతుల భూ సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చేయాలన్నారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి జరగాల్సిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయని చెప్పారు. ఎప్పుడున రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్ బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

గోస్పాడు: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దీబగుంట్ల హైస్కూల్ హెచ్‌ఎం నాగలక్ష్మి అన్నారు. ఆ స్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచి ఇటీవల క్రీడా పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించి హెచ్‌ఎం మాట్లాడారు. గత సంవత్సరంలో కూడా జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డుల్లో తమ పాఠశాల 5వ స్థానంలో నిలిచిందన్నారు. పలువురు విద్యార్థులు విలువిద్య, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, ఫెన్సింగ్, యోగా, బాక్సింగ్, త్రోబాల్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అలాగే రాష్ట్ర అండర్-17 ఫెన్సింగ్ సాబర్ బాలికల విభాగంలో దివ్యశ్రీ, వ్యక్తిగత టీం విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అండర్-17 బాలుర ఫెన్సింగ్ విభాగంలో లక్ష్మీనరసింహ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారన్నారు. ఫెన్సింగ్‌లో సాబర్ విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో అంజికుమార్ గోల్డ్ మెడల్ , త్రోబాల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో మహేష్ గోల్డ్ మెడల్, 65 కేజీల ఫ్రీ స్టైల్ విభాగంలో ఎన్.గణేష్ కాంస్య పతకాలు సాధించారన్నారు.

భూతాపాన్ని నివారించేది మొక్కలే



మొక్కలు నాటుతున్న అధికారులు, అధ్యాపకులు



సున్నిపెంటలో మొక్క నాటుతున్న అధికారులు

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్: భూమి రోజురోజుకు వేడెక్కుతూ ప్రకృతి విలయాలకు కారణమవుతోందని దీన్ని నివారించేందుకు మొక్కలను పెంచడమే మార్గమని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫారెస్ట్ వి.సాయిబాబా తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ విష్ణు నాగవిజయ్,వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి,ఎఫ్ఆర్వో పట్టాభి, జంతుశాస్త్ర అధ్యాపకులు కృష్ణ, ఎన్జీవో కలీముల్లా పాల్గొన్నారు.

వెలుగోడు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఫారెస్ట్ రేంజర్ ఎంఏ ఖాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. ప్రిన్సిపాల్ శ్రీనిజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సున్నిపెంటలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ బాధ్యత పాలిటెక్నిక్ కళాశాల అధికారులు తీసుకోవాలని అటవీ అధికారులు కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగయ్య మాట్లాడుతూ వనాలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అటవీశాఖ అసిస్టెంట్ కన్జర్వేటర్ పి.ధనరాజ్,రేంజ్ అధికారి వి.నరసింహులు, డిప్యూటీ రేంజ్ అధికారి ఎస్.బషీర్‌అహ్మద్, సెక్షన్ ఆఫీసర్ జె.నాగునాయక్, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆకుముడత తెగులుపై అప్రమత్తంగా ఉండాలి



గువ్వలకుంట్లలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

కొత్తపల్లి: వరి సాగు చేసే రైతులు ఆకుముడత తెగులుపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పాలెంచెరువు గూడెం, గువ్వలకుంట్ల సమీపంలోని వరిపొలాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి సాగులో ఆకుముడత పురుగును గుర్తించామని తెలిపారు. అలాగే జింక్ లోపం ఉన్నట్లు గమనించామని చెప్పారు. వీటిపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆకుముడత నివారణకు వేపనూనె లీటర్ నీటికి 5 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా జింకు లోప నివారణకు జింకు సల్ఫేట్ రెండు గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం గువ్వలకుంట్ల రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేసి ఈ పంటనమోదు ప్రక్రియ, ఈకేవైసీపై ఆరా తీశారు. త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. వ్యవసాయ సహాయకుడు షేక్ జాహిద్, రైతులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

నందికొట్కూరు: ప్రతి రైతు ఈ-పంట నమోదు తప్పనిసరి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతి విజయకుమార్ తెలిపారు. శుక్రవారం పగిడ్యాల మండల పరిధిలోని నెహ్రూ నగర్ పొలిమేరలో వ్యవసాయశాఖ సిబ్బంది చేస్తున్న ఈ-పంట నమోదును ఏఓ పరిశీలించారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోకపోతే పంటలకు సంబంధించిన ప్రభుత్వ ప్రయోజనాలు, ఇన్సూరెన్స్ వర్తించదని తెలిపారు. కౌలు రైతులు సాగు హక్కు పత్రాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు వెంకరమణ, రైతులు ఉన్నారు.

ఘనంగా మౌలాలిస్వామి పీర్ల ఊరేగింపు



గ్రామంలో పీర్ల ఊరేగింపు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: మండల కేంద్రంలో మౌలాలి స్వామి పీర్ల ఊరేగింపు ఘనంగా సాగింది. వారం నుంచి పీర్ల చావిడిలో మౌలాలి స్వామి పీర్లకు భక్తులు పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం స్వామివారి ఊరేగింపు కనుల పండువగా జరిగింది. గ్రామస్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం రాత్రి మౌలాలిస్వామి పీర్ల పెద్ద సరిగెత్తును జరుపుకున్నారు. భక్తులు అగ్ని గుండం ప్రవేశం చేశారు.